క్లుప్తంగా

21న ప్రత్యేక అదాలత్

తెనాలిరూరల్: ఈ నెల 21వ తేదీన ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి మంగళవారం తెలిపారు. 21న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో రెవెన్యూ కేసులు, మోటారు వాహన ప్రమాద క్లెయిముల వివాదాలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

నేడు సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ

కొల్లిపర: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్ వరి పంటలో ఎలుకల నివారణకు గ్రామంలోని పాలకేంద్రం కల్యాణ మండపంలో మందు పంపిణీ చేయనున్నట్లు ఏఓ కె.వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిఆపరు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెనాలిటౌన్: రూరల్ మండల గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో బుధవారం ఎలుకల నివారణ మందు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి జి.ప్రేమసాగర్ తెలిపారు. మార్కెట్ యార్డు ఆవరణలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం విలేకరులకు వివరాలు తెలియజేశారు. రైతులందరూ నూనె, నూకలు తీసుకురావాలని సూచించారు. రైతులకు ఉచితంగా ఎలుకల మందు ప్యాకెట్లు పంపిణీ చేస్తామన్నారు.

పట్టణ ప్రముఖుడు వంగల మాధవరావు మృతి



తెనాలి: పట్టణ ప్రముఖుడు వంగల మాధవరావు (54) మృతి చెందారు. హృద్రోగ సమస్యతో ఆయన కొద్ది రోజులుగా హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్నారు. మంగళవారం ఉదయం ఆయన మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. వెండి వ్యాపారంలో కొనసాగుతున్న మాధవరావు తన నాయకత్వ లక్షణాలతో వివిధ సంఘాల్లో కీలకపాత్ర పోషిస్తూ వచ్చారు. ప్రస్తుతం తెనాలి పట్టణ వెండి వ్యాపారుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. బ్రాహ్మణ పరిషత్, తెనాలి ఉపాధ్యక్షుడిగా కార్యక్రమాలను చేస్తున్నారు. తెనాలిలోని ప్రముఖ దేవస్థానం వైకుంఠపురం ట్రస్ట్‌బోర్డు సభ్యుడిగానూ సేవలందించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. తెనాలి మండలం అంగలకుదురులో అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏబీ చలం, సిబ్బంది మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన ఎస్.బాబర్ వద్ద 13 క్వార్టరు సీసాలు లభించాయి. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ చలం తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల అందించిన వివరాలు.. తెనాలి– విజయవాడ రైలు మార్గంలోని కొలకలూరు స్టేషన్ సమీపంలో సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మంగళవారం రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేక ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టిందా అన్న అంశంపై స్పష్టత లేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడిగా రామకృష్ణ



తెనాలిటౌన్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పట్టణానికి చెందిన పాటిబండ్ల రామకృష్ణ నియమితులయ్యారు.ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరి నుంచి మంగళవారం నియామక ఉత్తర్వులు వచ్చినట్లు రామకృష్ణ తెలిపారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం తమ మీద ఉంచిన నమ్మకం నిలబెట్టుకుని జిల్లాలో పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని ఆయన తెనాలిలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు.

యాచకునికి అంత్యక్రియలు

తెనాలిఅర్బన్: యాచన చేస్తు జీవించే వృద్ధుడికి శ్రీశివలింగేశ్వర భక్త బృంద సేవా సమితి సభ్యులు మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు.. తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలో 60 సంవత్సరాల వృద్ధుడు యాచిస్తూ జీవించేవాడు. మంగళవారం ఓ దుకాణం ముందు మృతి చెందాడు. దుకాణదారులు త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆప్రాంతంలో అతడి గురించి విచారించి ఎవరు లేరని తెలియటంతో శ్రీశివలింగేశ్వర భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీనుకు విషయం తెలియజేసి అంత్యక్రియలు నిర్వహించాలని కోరారు. దీంతో సమితి సభ్యులు బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పిన్నెల రాఘవ, పోతురాజు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తూములూరు(కొల్లిపర): ప్రజల ఆరోగ్య రక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు.జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవాడికీ ఖరీదైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మండలంలో 45 రోజుల పాటు వైద్యుల శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తూములూరు గ్రామ సచివాలయం పరిధిలో 7,250 మంది జనాభాకు 2,650 గృహాలల్లో ఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది గత 15 రోజుల నుంచి ఇంటింటికి వెళ్లి సర్వే చేసి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వమే స్వయంగా వైద్య క్యాంపులు నిర్వహిస్తూ మందులు ఇవ్వటం ఇప్పటి వరకు ఏ రాష్ట్రంలో చేపట్టలేదని వివరించారు. క్యాంపులలో దీర్ఘకాలిక రోగులకు జిల్లా వైద్యశాలకు, కార్పొరేట్ వైద్యశాలకు సిఫార్సు చేస్తూ అవసరమైతే ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసి వారికి వెంటనే చికిత్స అందేలా కృషి చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. తొలుత పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచి బాణవత్ అరుణాబాయ్, ఉపసర్పంచి మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఈమని హరికోటిరెడ్డి, పాలకేంద్రం అధ్యక్షుడు వి.ఉమామహేశ్వర రెడ్డి, ఎంపీటీసీ ఎ.బసవపున్నారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు అవుతు పోతిరెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ బద్దిగం శ్రీనివాసరెడ్డి, నాయకులు ఈద హర్షవర్ధన్ రెడ్డి, మర్రెడ్డి సాంబిరెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీసుధ, వైద్యులు ప్రియాంక, సాయికిరణ్, షేక్ ఖరిముల్లా, శ్రీలత బాయ్, ఎంపీడీఓ వి.విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రవిశంకర్, శంకరయ్య, వీఆర్ఓ రామారావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సురక్ష సర్వే

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన ఇంటింటి సర్వే విస్తృతంగా కొనసాగుతోంది. మంగళవారం గంగానమ్మ, ముత్తింశెట్టి పాలెం, సాలిపేట, గాంధీనగర్–2 పాండురంగపేట, బాలాజీరావుపేట, చెంచుపేట సచివాలయాల పరిధిలోని ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి టెస్ట్‌లను చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. త్వరలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిని వెంటనే తీసుకెళ్లి చికిత్స చేయించనున్నట్లు ఆరోగ్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి పోతుల ఉషారాణి, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, హెల్త్ విజిటర్‌లు వెంకటేశ్వరమ్మ, విజయ కుమారి పాల్గొన్నారు.



తెనాలిలో మహిళకు బీపీ పరీక్ష చేస్తున్న సిబ్బంది



కఠెవరం వైద్యశిబిరంలో....

ప్రజలందరికీ ఆరోగ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

తెనాలిటౌన్: ప్రజలందరికీ ఆరోగ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రూరల్ మండలం కఠెవరం–2 సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో రోగులతో ఎమ్మెల్యే మాట్లాడారు.

నేడు వల్లభాపురంలో వైద్య శిబిరం

వల్లభాపురం(కొల్లిపర): మండలంలోని వల్లభాపురం గ్రామంలోని గ్రామ సచివాలయం–1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. పేరంటాలమ్మ గుడి ఆవరణ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే శివకుమార్ వైద్య శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

అక్కడ అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. బీపీ, షుగర్, రక్తపరీక్షలు చేస్తున్న ఆరోగ్యసిబ్బందితో మాట్లాడారు. కొలకలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పిహెచ్.వి.సుబ్బారావు వివరాలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం పేద ప్రజలకు ఎక్కువగా ఉపయోగపడుతుందన్నారు. మండల ప్రత్యేకాధికారి వనజ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందన్నారు. వైద్యుల బృందం సుబ్బారావు, దిలీప్, శాంతి, అఫీఫా, మన్మథరావు సేవలందించారు.ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, సర్పంచి బండికళ్ల ప్రసాద్, ఎంపీడీఓ ఎల్.విజయాలక్ష్మణ్, తహసీల్దార్ కె.రవిబాబు, సీడీపీఓ సునీత, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ గౌస్, పీహెచ్ఎన్ పద్మశ్రీ, సీహెచ్ఓ ప్రియాంక, ఎంపీహెచ్ఓ రాజయ్య, హెచ్ఎస్ వెంకటరెడ్డి, హెచ్‌వీ ప్రసన్నలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు గంపల శివనాగేశ్వరరావు, ఎంపీటీసీ మైలా భానుప్రసాద్, బుజ్జిబాబు, శివారెడ్డి, ఎల్.చినబాబు, మంచాల శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, ఎరుకలపూడి సర్పంచి చందు శాంతికుమార్, పార్టీ కన్వీనర్ పి.వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

డాడ్జ్‌బాల్ రాష్ట్ర జట్టుకు ముగ్గురు క్రీడాకారుల ఎంపిక



తెనాలి: బాపట్ల జిల్లా చిలుమూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–14 డాడ్జ్ బాల్ పోటీల్లో గుంటూరు జిల్లా తరఫున ఆడిన స్థానిక వివేక విద్యాసంస్థల విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. ఇదే నెలలో వారణాసిలో నిర్వహించనున్న జాతీయ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు కె.కైలాష్, నాయుడు రెడ్డి, టి.ఆనంద్‌వర్ధన్‌రెడ్డి ఎంపికైనట్టు మంగళవారం నిర్వాహకులు తెలిపారు. క్రీడాకారులను, పీఈటీ పి.బాబీవెస్లీ, జి.తేజాను సంస్థ డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ అభినందించారు. వీరితో కో–ఆర్డినేటర్ షెహనాజ్, చౌదరి, శ్రీనివాస్ ఉన్నారు.

సైన్ లాంగ్వేజ్ వ్యక్తులను సమానంగా చూడాలి

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో సైన్ లాంగ్వేజ్ వ్యక్తులను అందరితో సమానంగా చూడాలని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. మంగళవారం అమరావతి రోడ్డులోని కళాశాలలో అంతర్జాతీయ సైన్ లాంగ్వేజ్(మూగ, చెవుడు) దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సైన్ లాంగ్వేజ్ ప్రతినిధులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, అసిస్టెంట్ డైరెక్టర్ ఏ సువార్త, జిల్లా అధ్యక్షుడు ఎస్.చంటిబాబు, ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఓఎస్డీ పి.సీతారామయ్య పాల్గొన్నారు.

తెనాలిలో ప్రజాసంఘాల నిరసన



బ్లాక్ డే ప్రదర్శనలో వివిధ సంఘాల నేతలు

తెనాలి: రైతాంగ ప్రదర్శనపై ఉద్దేశపూర్వకంగా జీపును నడిపి ముగ్గురు రైతులు, ఒక విలేకరి మరణానికి కారకుడైన కేంద్ర మంత్రి అజయ్ కుమార్ మిశ్రా కుమారుడు అశిష్‌మిశ్రా చేసిన దుర్మార్గానికి నిరసనగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం కార్మిక, రైతు సంఘాలు తెనాలిలో బ్లాక్ డే పాటించారు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న రైతాంగ ప్రదర్శనలో జరిగిన దారుణంపై దేశవ్యాప్తంగా కార్మిక, రైతు సంఘాలు ఇచ్చిన బ్లాక్ డే పిలుపుకు అనుగుణంగా పట్టణంలో ప్రదర్శన చేశారు. రైతుకూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బొల్లిముంత సాంబశివరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కారం

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకాన్ని ప్రవేశపెట్టి రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ఈ సర్వే వల్ల రైతులకు శాశ్వత భూహక్కు రావడంతో భూ వివాదాలు కూడా పరిష్కారం అవుతున్నాయని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి అన్నారు. దుగ్గిరాల మండలం మోరంపూడి గ్రామంలో రీసర్వే పూర్తయిన సందర్భంగా డ్రాఫ్ట్ ఆర్ఓఆర్‌ను గతనెల 30వ తేదీన ప్రచురించారు. దానిపై అభ్యంతరాలు సేకరించేందుకు గ్రామసభ ఏర్పాటుచేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించిన భూ రీసర్వేపై ఇప్పటికే సచివాలయంలో డ్రాఫ్ట్ ఆర్ఓఆర్‌ను ప్రచురించామని, దానిపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, ఇక్కడే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వేపై గ్రామసభలో ఎటువంటి అభ్యంతరాలు లేకపోతే చేతులు ఎత్తి తమ ఆమోదాన్ని తెలపాలని కోరడంతో అందరూ రీ సర్వేపై సంతృప్తి వ్యక్తం చేస్తూ చేతులు ఎత్తారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇత్తడి రమేష్, ఎంపీటీసీ సభ్యులు సురేష్, పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి రత్నకుమారి, గ్రామ సర్వేయర్ సునీత, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు పానకం బహిరంగ వేలం జరిగేనా!

- ఇప్పటికే రెండు సార్లు వాయిదా
- రెండు దరఖాస్తులు మాత్రమే కొనుగోలు చేసిన పాటదారులు
- మరలా పాతవారికే అవకాశం దక్కనుందా!

మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న పానకాల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పానకం తయారు చేసి భక్తులకు విక్రయించేందుకు ఈ టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలం బుధవారం ఉదయం 11 గంటలకు దిగువ సన్నిధిలోని ఆలయ ముఖమండపంలో నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన విషయం విదితమే. మూడో సారైనా ఒక కొలిక్కి వస్తుందా లేదా మరలా వాయిదా పడుతుందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. నిబంధనల మేరకు పానకం పాట పాడిన వెంటనే పాట పాడిన మొత్తం అదే రోజు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో పానకం పాటను రూ.1.09 కోట్లకు పాడిన విజయవాడకు చెందిన ప్రహ్లాద ఎంటర్‌ప్రైజెస్ వారు సమయానికి నగదు చెల్లించకపోవడంతో పాటను రద్దు చేశారు. రెండేళ్లుగా వేలంలో పాల్గొంటున్న ప్రహ్లాద ఎంటర్‌ప్రైజెస్ వారు అత్యధికంగా పాట పాడినా నగదు చెల్లించలేకపోవడంతో రద్దు చేస్తున్నారు. అయితే మరలా పాట పెట్టినప్పుడు వివిధ రకాల పేర్లతో వేలం దక్కించుకుంటున్నారు. గుత్తేదారు భక్తులను పానకం పేరుతో దోచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ ఏడాదైనా పానకం గుత్తేదారుడు మారతారా లేక పాతుకుపోయిన గుత్తేదారే దక్కించుకుంటారా అని భక్తులలో చర్చనీయాంశంగా మారింది. పాట పాడుకునేందుకు దరఖాస్తు ఫారాలను మంగళవారం సాయంత్రం 5 గంటల వరకే సమయం వుండగా పాత గుత్తేదారు మాత్రమే రెండు దరఖాస్తులు తీసుకోగా ఎవరు దరఖాస్తులు తీసుకోకపోవడంతో పాత గుత్తేదారుకే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ టెండర్, సీల్డు టెండర్‌లలో ఎవరైనా అధికంగా కోట్ చేసి ఉంటే తప్ప పానకం పాట పాత గుత్తేదారుడే తక్కువకే పాడుకునే అవకాశాలుండడం గమనార్హం. నిబంధనల ప్రకారం బుధవారం పానకం పాట పెట్టడం జరుగుతుందని ఈ టెండర్లు, సీల్డ్ టెండరు, బహిరంగవేలంలో ఏది అధికంగా పాట వస్తుందో వారికే కెటాయించడం జరుగుతుందని ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి తెలిపారు.

క్షయ వ్యాధిపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పి.రవికుమార్ మాట్లాడుతూ క్షయవ్యాధి అంటువ్యాధి అని, ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతుందని వివరించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందని తెలిపారు. వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ప్రతి రోజూ వ్యాయామం చేయడం ద్వారా త్వరగా కోలుకుంటారని అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

స్రవంతికి అభినందనలు



ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఎ.స్రవంతి ఇటీవల కర్నూలు జిల్లా మహానందిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో జిల్లా తరుపున పాల్గొంది. పోటీలో తృతీయ స్థానం సాధించింది. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో హెచ్ఎం సాంబశివరావు, పీడీ శ్రీనివాసరావు పాల్గొని స్రవంతిని అభినందించారు.

సుబ్బారెడ్డి సేవలు చిరస్మరణీయం

గుంటూరు ఎడ్యుకేషన్: వృత్తి బాధ్యతలు అంకితభావంతో పని చేసిన శ్యామల సుబ్బారెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. పేరేచర్ల జెడ్పీ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఇటీవల మృతి చెందిన శ్యామల సుబ్బారెడ్డి సంస్మరణ సభను మంగళవారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు మాట్లాడుతూ విద్యారంగాభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించడంతో పాటు ఎస్టీయూ నిర్మాణానికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోనూ సుబ్బారెడ్డి విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్లు కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆంధ్రాకు జగనే సీఎం కావాలంటున్న ప్రజలు

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాజకీయాల్లో ఇచ్చిన హామీని కచ్చితంగా నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధిని ప్రజలు అర్థం చేసుకున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' అనే కార్యక్రమ సన్నాహక సమావేశాన్ని మంగళవారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవారిపై ప్రేమతో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రూ.2.35 లక్షల కోట్లను పేదల ఖాతాల్లో జమ చేసి భరోసా ఇచ్చిన కారణంగా ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపు ఉన్నారని చెప్పారు. జగనన్నే మా భవిష్యత్, జగనన్న సురక్ష, ఆరోగ్య సురక్షను విజయవంతం చేసినట్టే 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వం మేనిఫెస్టోను, వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను ప్రజల ముందు ఉంచితే, ఏ ప్రభుత్వం చెప్పిన హామీలను నెరవేర్చిందో ప్రజలే చెబుతారని అన్నారు. డ్వాక్రా మహిళలకు రుణాలను మాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు తన హామీని నిలబెట్టుకోలేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి డ్వాక్రా రుణాల మొత్తం రూ.12 వేల కోట్లు కాగా, వడ్డీతో సహా రూ.24 కోట్లకు చేరుకున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి మాట్లాడుతూ సచివాలయాల వారీగా శిక్షణ, అనంతరం ఇంటింటి ప్రచారం చేయాల్సిన విధానాన్ని వివరించారు. రాబోయే ఎనిమిది నెలలు కీలకమని, సమష్టిగా పనిచేయాలని సూచించారు. జేసీఎస్ మండల కన్వీనర్ ఫరీద్ మాట్లాడారు. వేదికపై రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు ధర్మరాజుల చెన్నకేశవులు, కాలిశెట్టి ఫణికుమార్, చక్కా సీతమ్మ, ధూళిపాళ్ల పవన్‌కుమార్ ఉన్నారు.

మహాత్మ ఆశ్రమ నిర్వాహకుడికి లైఫ్ ఎఛీవ్‌మెంట్ అవార్డు



ఐఆర్ఎస్ అధికారి భూపాల్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న రామలింగాచారి

తెనాలిటౌన్: పట్టణానికి చెందిన మహాత్మ ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి లైఫ్ ఎఛీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రం చిట్యాలలోని మహాత్మగాంధీ దేవాలయం వ్యవస్థాపకులు, ఐఆర్ఎస్ అధికారి ఎం.భూపాల్‌రెడ్డి సోమవారం లైఫ్ ఎఛీవ్‌మెంట్ అవార్డును రామలింగాచారికి అందజేశారు. 20 ఏళ్ల నుంచి ఆశ్రమంలో వృద్ధులకు ఉచిత భోజనం, వసతి, ప్రాథమిక వైద్యసేవలు అందిస్తుండడంతో గుర్తింపుగా అవార్డు అందజేసినట్లు రామలింగాచారి తెలిపారు. గాంధీ జయంతి రోజున అవార్డు అందుకోవడం గర్వంగా ఉందన్నారు.


వీఐటీ- ఏపీలో సంగీత కచేరి

తాడికొండ: తుళ్లూరు మండలం ఐనవోలు వీఐటీ–ఏపీలో మంగళవారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూర్ సెల్ సహకారంతో హార్మోనీ అనలిస్ట్ అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంగీత కచేరి నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆర్జిత్‌సింగ్ పాడిన సోను నిగమ్ కల్ హో నాహో, సిద్ శ్రీరామ్ పాడిన యువన్ శంకర్ రాజా నీ యదలో నాకు, శ్రేయ ఘోషల్ పాడటానికి శ్వేతామోహన్ రాసిన వా వాతి పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి కృత్రిమ మేథస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి సంగీత కచేరి నిర్వహించడం అభినందనీయమన్నారు. సంగీత ప్రపంచంలో సాంకేతికత, ఆవిష్కరణల శక్తికి ఈ సంఘటన నిజమైన నిదర్శనమన్నారు. కార్యక్రమంలో భాగంగా నల్ చాప్టర్ ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ సీబీ చక్రవర్తి సాంకేతికత, సృజనాత్మకత అద్భుత కలయికతో రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మ్యూజిక్ వీడియోలు ప్రదర్శించారు. నల్ చాప్టర్ ప్రెసిడెంట్ వెంకట్ హర్ష రాయసం, వైస్ ప్రెసిడెంట్ కె ప్రణవ్ సాయి, సంజయ్‌ల సహకారాన్ని అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్ ఐఈఈసీ డాక్టర్ అమీత్ చవాన్, డాక్టర్ హరిసీత, డాక్టర్ శిబి చక్రవర్తి, ప్రొఫెసర్ శామ్యూల్ జాన్సన్ డాక్టర్ సుధాకర్ ఇలంగో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



తెనాలిఅర్బన్: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం తెనాలిలో మంగళవారం కొనసాగింది. ఉదయం నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వికలాంగ, వితంతు, వృద్ధ వంటి పింఛన్లు పంపిణీ చేశారు. పట్టణంలోని లింగారావు సెంటర్–2 సచివాలయ పరిధిలోని బేతాళ కనకాంబరం అనారోగ్యంతో తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ అద్దెపల్లి శ్రావణి అక్కడక్కకు వెళ్లి వృద్ధాప్య పింఛన్‌ను అందజేశారు. అలాగే అయితానగర్ సచివాలయం పరిధిలోని వికలాంగుడు పిల్లి అంకమ్మరావుకు వలంటీర్ ఎం.మౌనిక వికలాంగ పింఛన్‌ను, చినరావూరు–1 సచివాలయ పరిధిలోని అప్పల వెంకటేశ్వర్లుకు డయాలసిస్ పింఛన్‌ను వలంటీర్ ఆర్.రాజేష్ అందజేశారు.



తెనాలి జిల్లా వైద్యశాలలో పింఛన్ అందజేస్తున్న వలంటీరు శ్రావణి



వికలాంగుడు అమ్మరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మౌనిక